క్లుప్తంగా

అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయండి



హైకోర్టు జడ్జి శరత్‌కు పూలబొకే అందిస్తున్న భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధులు

బూర్గంపాడు: భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టును ఏర్పాటు చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు జడ్జి కాజా శరత్‌ను కోరారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం హైకోర్టు జడ్జి శరత్‌ను భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కోర్టు దావాల ఆర్థిక పరిమితిని రూ.5వేల నుంచి రూ.20లక్షల వరకు పెంచాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతో సమానంగా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కోర్టును అప్‌గ్రేడ్ చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. భద్రాచలంలో అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు సున్నం రమేష్, శ్రీనివాసచారి, పేరాల నాగరాజు, శారదారెడ్డి, తిరుమలరావు, రామకృష్ణ, ఉలవల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'వేతనంతో కూడిన సెలవు టీబీజీకేఎస్ ఘనతే'

మణుగూరురూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా రేపు సింగరేణిలో వేతనంతో కూడిన సెలవు సాధించడం టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకే దక్కుతుందని మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పీవీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆనాడు అంబేడ్కర్ జయంతి వేడుకల కోసం ప్రత్యేక చొరవతో ప్రతీ ఏరియాకు రూ.లక్ష నిధులు ఇప్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఇజ్రాయేల్, బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, మస్తాన్, పవన్, ముకేష్ కుమార్, సేవా, దేవాకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి జన్మదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం గర్భిణులు, తల సేమియా సికిల్ సెల్ ఎనీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది రక్తదానం చేసినట్లు మురళీ తెలిపారు. ఇప్పటి వరకు మురళి 57 సార్లు రక్తదానం చేయడంతోపాటు ఎంతో మందితో రక్తదానం చేయించాడు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు జయరాం, ఎడ్విన్ కిషోర్, బురం నవీన్, శ్రీకాంత్, పడిదెల వంశీ, ఆనంద్, అజిత్, ఉమామహేశ్వరరావు, ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ చందు, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

దమ్మపేట: మండలంలోని గోపాలపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం, ముత్యాలమ్మ తల్లి ఆలయాల్లో విగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచే వేద పండితులచే శాస్త్రోక్తంగా అర్చన, హోమం, మండప పూజలు, బీజన్యాసాలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామం అంతా వేద మంత్రాలు, భగవత్ నామస్మరణతో మారు మోగిపోయింది. ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు నూతనంగా ప్రతిష్ఠాపన చేసిన స్వామి, దేవతా మూర్తులను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరుగా హాజరై, స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పని వేళలు మార్పు చేయాలి

మణుగూరురూరల్: విపరీతమైన ఎండల దృష్ట్యా కాంట్రాక్ట్ కార్మికుల పని వేళల్లో మార్పులు చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు వెలగపల్లి జాన్ యాజమాన్యాన్ని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఎండ తీవ్రత వల్ల కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వర్తించలేకపోతున్నారని, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా యాజమాన్యం కానీ, అధికారులు కానీ పట్టించుకోకపోవడం సరికాదన్నారు.

భారం దింపిన వాటర్ వీల్స్

- బిందెలు మోసే బాధకు చెక్
- రేగులగండిలో ఉపయోగిస్తున్న ఆదివాసీలు

ప్రతీ ఏటా వేసవికాలం వచ్చిందంటే గిరిజన గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజల కష్టాలు తప్పడం లేదు. నేటికీ గుక్కెడు నీటి కోసం చెలమలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. గిరిజన మహిళలు నెత్తి మీద బిందెలతో, పురుషులు నీటి కావిళ్లతో నీటిని తెచ్చుకోవాల్సి దుస్థితి. ఈ నేపథ్యంలో వాటర్ ఆన్ వీల్ లేదా రోలింగ్ బారెల్స్(నీటి చక్రాల) పద్ధతి దూరం నుంచి నీటిని మోసుకుంటూ రావాల్సిన అవసరతను తగ్గించింది.

మణుగూరురూరల్: మండలంలోని గిరిజన గ్రామమైన రేగులగండిలో వాటర్‌వీల్స్ వాడుకలో ఉన్నాయి. ఇక్కడి గ్రామస్తులు తమ ఇంటి అవసరాలకు నీటిని ఈ పద్ధతిలోనే తెచ్చుకుంటున్నారు.

నీటి వెతలు వర్ణనాతీతం..

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో 22 లీటర్ల నీటి కోసం సగటును ఐదు కిలోమీటర్ల ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. మహిళలు తెల్లవారుజామునే నిద్ర లేచి ఇంటి పనులు చక్కబెట్టుకుని సుదూర ప్రాంతానికి వెళ్లి బిందెడు నీటి కోసం వారు పడే కష్టాలు వర్ణణాతీతం. మహిళలు బిందెలను తలపై మోయడం వల్ల మెడ, వెన్ను నొప్పి, కండరాల సంబంధిత సమస్యలకు దారి తీస్తోంది.

సమస్యలకు చెక్..

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లలు తలపై నీటిని మోసే బాధ నుంచి ఉపశమనం కలిగించేందుకు వాటర్ ఆన్ వీల్స్(రోలింగ్ బారెల్స్) ఉపయోగపడుతోంది. కుండలు, బిందెలను మోయాల్సిన అవసరం లేకుండా సునాయాసంగా ఇంటికి చేర్చుకోవచ్చు. సుమారు 25–40లీటర్ల సామర్థ్యంతో రోలింగ్ డ్రమ్‌కు అనుసంధానించబడిన హ్యాండిల్ కలిగి ఉంటాయి. ఈ వాటర్ వీల్‌ను లాగడం, నెట్టడం ఎంతో సులభం. బహుళ భూభాగాల్లో నడిచేలా, ఆహార గ్రేడ్, నీటిని తాగడానికి, నిల్వ చేయడానికి పూర్తిగా సురక్షితంగా రూపొందించబడింది. అటువంటి ఈ వాటర్ వీల్‌ను వినియోగించి రేగులగండిలో ఆదివాసీ ప్రజలు చెరువులు, బోర్లు, కుంటలు, పంపుల వద్ద నుంచి సునాయాసంగా నీళ్లను తెచ్చుకుంటున్నారు.



వాటర్ వీల్‌తో నీటిని తీసుకెళ్తున్న ఆదివాసీ

పేదల అభ్యున్నతే ధ్యేయం

దమ్మపేట: పేద ప్రజల సంక్షేమంతో పాటుగా వారి అభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామ స్థాయిలో అర్హులకు చేరవేసే బాధ్యతను కాంగ్రెస్ నాయకులు తీసుకోవాలన్నారు. మండల, గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఎలాంటి వర్గ విభేదాలకు తావివ్వకుండా సమష్టిగా పార్టీ పటిష్ట నిర్మాణం కోసం పనిచేయాలని ఆదేశించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

ఐక్యతతోనే హక్కుల సాధన

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనుల హక్కులను గిరిజనుల చెప్పునే వలసవాదులు దోచుకుంటున్నారని, ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమని ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్య దొర అన్నారు. స్థానిక గిరిజన అభ్యుదయ భవన్‌లో జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులకు చెందాల్సిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వలస గిరిజనులు కొల్లగొడుతున్నారని, ఎస్టీ వర్గీకరణతో వారి ఆధిపత్యానికి అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం జేఏసీ నాయకులు పలు తీర్మాణాలపై చర్చించారు. ఈ తీర్మాణాల సాధనకై జాతీయ స్థాయిలో ఉద్యమాలు నిర్వహించే ఏప్రిల్ చివరి వారంలో రాష్ట్రస్థాయి మేధోమేదనం జరపడానికి నిర్ణయించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆదివాసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, గుమ్మడి నర్సయ్య, తాటి వెంకటేశ్వర్లు, వట్టం నారాయణ, పోడియం బాలరాజు, సీతారాములు, జార బిక్షం, వీరయ్య, పాయం రవి వర్మ, కారం పుల్లయ్య, కెచ్చల రంగారెడ్డి, పుల్లారెడ్డి, కుర్సం సుబ్బారావు, లక్ష్మయ్య, బుచ్చయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ

- మండలంలో వెయ్యికి పైగా..
- అప్లికేషన్లకు నేటితో ముగియనున్న గడువు

అశ్వాపురం: రాజీవ్ యువవికాసం పథకం రుణాలకు మండలంలో దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. శనివారం నాటికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విభాగాలకు దరఖాస్తులు వెయ్యికి పైగా వచ్చాయి. శుక్రవారం వరకు కులాల వారిగా ఎస్టీ 341, ఎస్సీ 230, బీసీ 372, ఈబీసీ 14, మైనార్టీ 22 దరఖాస్తులు వచ్చాయి. శనివారం అన్ని విభాగాలకు 55 దరఖాస్తులు రాగా.. మొత్తం లెక్క 1,034కు చేరింది. ఆది, సోమవారాల వరకు గడువు ఉండటంతో మరో 200 నుంచి 300 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం సేవా కేంద్రంలో యూడీసీ పద్మావతి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగా.. సర్వర్ పని చేయక దరఖాస్తుదారులు ఆన్‌లైన్ సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్‌కు రూ.100 వరకు తీసుకుంటున్నారు. ప్రస్తుతం మండలానికి ఎన్ని యూనిట్లు మంజూరు అవుతాయి ఎంత మందికి రుణాలు వస్తాయో అన్న సందేహంలో దరఖాస్తుదారులు ఉన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న యూడీసీ పద్మావతి

ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ ఎస్‌ఐ–2గా శ్రావణ్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేయగా.. వీరి స్థానంలో ఎస్‌ఐ–1గా స్వప్నను, ఎస్‌ఐ–2గా శ్రావణ్ కుమార్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆదివారం శ్రావణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఎస్‌ఐ–1 గంజి స్వప్న హనుమాన్ జయంతి బందోబస్త్ సందర్భంగా హైదరాబాద్ వెళ్లారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని బండిరేవు, బైరాగులపాడు, రామారావుపేట గ్రామాల్లో జరిగిన వివిధ శుభ, అశుభ కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం పాల్గొన్నారు. బండిరేవు గ్రామంలో ఓ వివాహ కార్యక్రమం, బైరాగులపాడులో పుట్టినరోజు కార్యక్రమం, రామారావుపేటలో దశదిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు అన్నె సత్యనారయణమూర్తి, యంబడి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మతల్లి జాతర



అమ్మవారిని ఊయలలో లాలిస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న అంకమ్మతల్లి జాతర ఆదివారం ముగిసింది. ఈ నెల 8న ప్రారంభమైన జాతరలో భాగంగా అగ్నిగుండం ప్రవేశం, మైలపట్నం, బద్దెగొర్రితోపాటు ప్రత్యేక పూజలు చేశారు. గోపయ్య, తిరుపతమ్మ అమ్మవార్ల కల్యాణమహోత్సవం వైభవోపేతంగా జరిపించారు. చివరిరోజు శివాలయం వ్యవస్థాపక ధర్మకర్త మారగాని శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ములకలపల్లి: మండలపరిధిలోని మంగలిగుట్టలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ కల్యాణ వేడుకల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. గండుగుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని కమిటీకి సూచించారు. కాగా ఈనెల 21న నిర్వహించే కల్యాణ ఘట్టానికి హాజరు కావాల్సిందిగా ఆలయ ధర్మకర్త రాయల కేథారేశ్వరరావు ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేశారు. ములకలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి పోస్టర్లు ఆవిష్కరించారు. గాడి తిరుపతి రెడ్డి, శనగపాటి రవి, గొర్ల రాజు ఉన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, నారాయణపురం గ్రామ శివారులోని కట్ట మైసమ్మ తల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవార్లకు నైవేథ్యాలు సమర్పించి, అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా ఆలయ వద్ద అన్నసమారాధాన కార్యక్రమాలను నిర్వహించారు.

మోగుతున్న ప్రమాద ఘంటికలు



పాఠశాల ప్రవేశ మార్గంలోని బోర్డు దిమ్మెకు పగుళ్లు వచ్చిన దృశ్యం



ఊగిసలాడుతున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నిచ్చెన

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థులకు ఇక్కడి పరిస్థితులు ప్రమాదకరంగా మారాయి. 1 నుంచి 8వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 133 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి పాఠశాల ప్రాంగణంలో రక్షిత నీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్ ఐరన్ నిచ్చెన లుకలుకలాడుతోంది. ఎప్పుడు కిందపడి ఏ ప్రమాదాన్ని తెస్తుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు, పాఠశాల ప్రవేశమార్గంలో ఉన్న ఐరెన్‌బోర్డు గాలిదుమారానికి, కోతులు బెడదతో ఊగుతూ ఉంటుందని భయం దోళనకు గురవుతున్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకుని ప్రమాదాన్ని నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సెక్రటరీకి సమాచారం ఇచ్చాం: హెచ్‌ఎం

తాగునీటి ట్యాంకుకు ఉన్న నిచ్చెన పరిస్థితిపై గ్రామపంచాయతీ సెక్రటరీకి మౌఖికంగా సమాచారం ఇచ్చినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఇక లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. పాఠశాల బోర్డు పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని, ఈ విషయాన్ని విద్యా కమిటీ బాధ్యులకు తెలిపామని వెల్లడించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



భద్రాచలంటౌన్: పతాక ఆవిష్కరణలో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

మణుగూరురూరల్: మండలంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) 12వ ఆవిర్భావ వేడుకలను మణుగూరు, పినపాక, అశ్వాపురం, మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ ఉపాధ్యాయులు పూనెం నాగేశ్వరావు ఆవిష్కరించగా.. సభ్యులు ఉద్యమ పతాక గీతాన్ని ఆలపించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శులు బి.రాము, బాలసాని రాంబాబులు మాట్లాడుతూ.. అధ్యాయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా.. హక్కులు బాధ్యతలుగా యూటీఎఫ్ పని చేస్తోందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యావ్యవస్థ పరిరక్షణకు నిరంతరం పోరాడుతోందని అన్నారు. అలాగే కుటుంబ సంక్షేమ నిధితో కష్టకాలంలో ఉన్న సంఘ కుటుంబాలకు సంఘం చేయూతనందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ మీరాహుస్సేన్, అధ్యక్షుడు బొల్లు అయిలయ్య, ఉపాధ్యక్షురాలు తోట విజయలక్ష్మి, స్వరూపారాణి, బి.పద్మ పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ 12వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు మాట్లాడుతూ.. తెలంగాణలో ఉపాధ్యాయ సమస్యల మీద రాజీ లేని పోరాటం చేస్తోందన్నారు. పోరాటం వల్లనే ఉపాధ్యాయ సమస్యలు చాలా వరకు సాధించామని, రానున్న రోజుల్లో ఉపాధ్యాయ సమస్యలపై సంఘం నిర్వహించే పోరాటాలకు ఉపాధ్యాయులు కదిలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, టి.బాలు, వెంకటేశ్వర్లు, సీహెచ్ అనిల్, రాజ శ్రీనివాస్, కొమరం శ్రీనివాస్, రమేష్, ఎమ్.రమేష్, సైదులు, ప్రసాద్, భారతి, కరుణకుమార్, సీహెచ్ శ్రీనివాస్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, పి.విజయబాబు, వెంకటేశ్వర్లు, అనిత, పూజిత తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలు చిరస్మరణీయం

మణుగూరురూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం వనజీవి దరిపెల్లి రామయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని బౌద్ధ అభిమానిక, సామాజిక కార్యకర్త ఏ.మంగీలాల్ అన్నారు. ఆదివారం మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న శ్రీవిద్యాభ్యాస పాఠశాలలో ఏర్పాటు చేసిన సంతాప సభలో వనజీవి రామయ్య చిత్రపటానికి విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ఆయన పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలపై రామయ్యకు ఉన్న అమితమైన ప్రేమతో ఇంటిపేరుగా వనజీవిగా మార్చుకుని గుర్తింపు పొందారన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కల పరిరక్షణకు పాటుపడడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.సుహాసిని, దేవి, స్వాతి, లింగంపల్లి రాధ, భూమి, గణేష్, పావని, అమిత, కోశయ్య, రామయ్య, అంజలి, శ్రీదేవి, రాకేష్, భీమ తదితరులు పాల్గొన్నారు.

ముక్తార్ సేవలు..

ములకలపల్లి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తుదిశ్వాస వరకూ జీవించిన ముక్తార్ పాషా సేవలు చిరస్మరణీయమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్‌కె.ఉమర్ అన్నారు. మండలపరిధిలోని మాధారం గ్రామంలో పార్టీ జిల్లా నాయకులు కుంజా కృష్ణ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామంలో రేపు ముక్తార్ స్మారకస్తూపం ఆవిష్కరణ, అనంతరం బయ్యారంలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డివిజన్ నాయకులు మారుతి రాఘవులు, నేలయ్య, వాసం నరసింహా, వెంకట రమణ, కమలక్క, రమణక్క తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆ'పూర్వ' కలయిక



భద్రాచలంటౌన్: ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కోర్రాజుల గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05లో టెన్త్ చదువుకు విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమైయ్యారు. పాఠశాలలో చదువుకున్న 20 ఏళ్ల అనంతరం కలుసుకున్న వారు ఒకరికొక్కరు ఆలింగనం చేసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారు చదువుకున్న తరగతి గదులను కలయతిరుగుతూ అప్పటి మధుర స్మృతులను తలచుకున్నారు. ఈ సందర్భంగా అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.

మణుగూరురూరల్: మండలంలోని రథంగుట్ట అర్బన్ పార్క్‌లో 2003 విద్యాసంవత్సరం ఎక్స్‌లెంట్ గ్రూప్‌ఆఫ్ స్కూల్–పైలట్‌కాలనీ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. విద్యాసంస్థల ఛైర్మన్ యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఖాదర్‌లు హాజరై మాట్లాడారు. 22 సంవత్సరాల కిందటి విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఎదగడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి దశలో వారు చేసిన విద్యాభ్యాసం, జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు నెమరువేసుకున్నారు. అనంతరం విద్య నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల యాజమాన్యం యాకుబ్, భాను,ఖాన్, లెనిన్, సురేష్, రామారావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

లోక రక్షకుడికి జయజయధ్వానాలు

- భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

చర్ల: మట్టల ఆదివారపు ప్రార్థనలను క్రైస్తవులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా పలు గ్రామాల్లో క్రైస్తవులు కర్జూరా, ఈత మట్టలతో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో రాజుల రాజుకు జై, హోసన్న జయము అంటూ నినాదాలు చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చీలలో మట్టల ఆదివారపు ఆరాధనలు జరిగాయి. ఈ సందర్భంగా మట్టల ఆదివారపు ప్రాముఖ్యతను పాస్టర్లు వివరించారు. ఆయా గ్రామాల్లోని పార్థనల్లో రెవరెండ్లు జెర్మియా, జె.శ్యాంసన్, ఎం.ప్రవీణ్, యేసుజీవం, జీవానందం, ప్రభుదాసు, జకర్యా, ప్రేమ్‌కుమార్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో మట్టల ఆదివారం పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులు ఈత మట్టలు చేత పట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విజయ్ కుమార్ బైబిల్‌లోని క్రీస్తు బోధనలను వినిపించారు. ఈ కార్యక్రమంలో సహాయ పాస్టర్ గడిదేసి సాల్మన్, ఫాస్ట్ రేట్ కార్యదర్శి కోశాధికారి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చర్ల: మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని ఈత మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

ములకలపల్లి: మండల కేంద్రంలోని పునీత జార్జి కథోలిక దేవాలయ విచారణ గురువు బాలశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ములకలపల్లిలో భారీ ప్రదర్శన చేశారు. ఈ ర్యాలీ నుద్దేశించి జీవన్‌జ్యోతి స్కూల్ ప్రిన్సిపాల్ అంథోని బాలరాజ్ జయంత్ మాట్లాడారు. యేసు ప్రభువు జరూసలేం పట్టణంలోకి ప్రవేశిస్తున్న శుభతరుణాన క్రైస్తవులు మట్టలతో ప్రదర్శనగా స్వాగతిస్తారని తెలిపారు. సమష్టి లోకరక్షకుడైన ఏసు సర్వమానవాళి రక్షణ కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. గుడ్ షపర్డ్ సిస్టర్స్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ నిర్మల, దీప్తి, బెనోషియా, క్రైస్తవ సంఘస్తులు పాల్గొన్నారు.



ములకలపల్లి: ఈత మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవ సోదరులు



భద్రాచలంటౌన్: ఈత మట్టలతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తున్న పాస్టర్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.:1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416